క్లుప్తంగా

ఆదివారం కూడా కరెంటు బిల్లులు చెల్లించొచ్చు

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలోని విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా బిల్లు చెల్లించవచ్చునని విద్యుత్ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం శెలవు దినం అయినప్పటికీ బిల్లులు చెల్లించే విధంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ ఆఫీసు, కరెంటు బిల్లుల కౌంటర్స్ ఓపెన్ చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని తమ బిల్లులను చెల్లించాలన్నారు.

ఆలయాలు మూసివేత



శ్రీనారాపుర వెంకటేశ్వరస్వామి ఆలయానికి తలుపులు వేసిన అధికారులు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని ఆలయాలను పాక్షిక చంద్రగ్రహణం కారణంగా అర్చకులు మూసివేశారు. శనివారం రాత్రి స్థానిక టీటీడీ శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని అర్చకులు, అధికారులు సాయంత్రం 4.55 నిమిషాలకు ఆలయానికి తలుపులు వేశారు. ఆదివారం ఉదయం 5.50 నిమిషాలకు ఆలయంను శుద్ధిచేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ అధికారి మోహన్ తెలిపారు.

నిడుజివ్వి గ్రామంలో ప్రజాదర్బార్



ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండలంలోని నిడుజివ్వి గ్రామంలో శనివారం ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి తన స్వగృహంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి అందులో ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలపై చర్చించారు. సంక్షేమ పథకాలు అందని ప్రజలపై దృష్టి పట్టాలన్నారు. సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ అందాలన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల క్లీన్ అండ్ గ్రీన్



డీఎస్పీ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ ఐక్యతా వారోత్సవాల సందర్భంగా శనివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపక బృందం, స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ వినోద్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్, పీఆర్వో బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనీత, విజయలక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా 5 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ఇన్‌చార్జి కమిషనర్ రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రాస్ రోడ్డు సమీపంలో నగర ప్రవేశం వద్ద జరుగుతున్న ఆర్చి నిర్మాణం కారణంగా ట్రాఫిక్‌ను మార్కెట్ యార్డు సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ పక్క నుంచి మరలించడం జరిగిందని వాహన దారులు, నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన అందులో తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో మధుసూదన్

వల్లూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ శంకర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ సుహాసినితో సమావేశం నిర్వహించి మండలంలో జరుగుతున్న రీసర్వేతో పాటు పలు అంశాలను గురించి ఆరా తీశారు. కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

అర్హుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చెన్నూరు : అర్హుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అధికారులు అనేక సార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మెగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తోందన్నారు. దీనికోసం 58 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. తద్వారా ప్రభుత్వ ఆసుపత్రులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ప్రతి 2 వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసి, గ్రామంలోని 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటుచేసి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. జాతీయ రహదారిలో ఇల్లు కోల్పోయిన బాధితులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. చెన్నూరు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి చాలా ఇరుకుగా ఉందని దానిని వెడల్పు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ పథకాలకు, అభివద్ధికి సంబంధించి ప్రతి గ్రామ సచివాలయంలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్ ఆర్, సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సొంటం నారాయణరెడ్డి, చెన్నూరు సర్పంచ్ సిద్ధిగారి వెంకటసుబ్బయ్య, ముమ్మడి సుదర్శన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ వారిష్, ఎంపీటీసీలు, నిరంజన్‌రెడ్డి, నాగిరెడ్డి, సాదిక్ అలీ, అధికారులు తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, పంచాయతీ రాజ్ డీఈ మురళి, ఈవోపీఆర్డీ సురేష్‌బాబు, విద్యుత్ ఏఈ రామలింగారెడ్డి, డాక్టర్ చెన్నారెడ్డి, ఏపీఎం గంగాధర్, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశులు

పులివెందుల టౌన్ : ఈనెల నూతనంగా వచ్చిన ఓటర్ జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే వెంటనే తెలియజేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం తాలూకాకు సంబంధించి 2.22లక్షల పై చిలుకు ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 1,08,726 మంది కాగా, మహిళలు 1,13,831 మంది ఉన్నారని, ఇతరులు 21 మంది ఉన్నారని తెలిపారు. బీఎల్‌ఓలు ప్రతీరోజు గడప గడపకు వెళ్లి ఏవైనా అభ్యంతరాలు ఉంటే సేకరించాలన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు సేకరించి సవరించాలన్నారు. 2024 జనవరి 5వ తేదీ నాటికి పూర్తి ఓట్ల జాబితా అందుబాటులోకి వస్తుందన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లేటప్పుడు గత జాబితాను, నూతన జాబితాను తీసుకెళ్లాలని, అందులో మార్పులు, చేర్పులు ఉంటే గుర్తించి సవరించాలన్నారు. ఎలాంటి అభ్యంతరాలకు తావులేకుండా చూడాలన్నారు. వచ్చే నెల 4, 5వ తేదీ, డిసెంబర్ 2, 3వ తేదీలలో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసి ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే వాటిని గుర్తించి సవరించాలన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీ నాయకులు, బీఎల్‌ఓలు సహకరించాలన్నారు. ఏఈఆర్‌ఓలు, తహసీల్దార్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓటర్లు డిసెంబర్ 9 లోపు మార్పులు చేర్పులు చేసుకోవాలి

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని ఓటర్లు డిశంబర్ 9వతేదీ లోపు మార్పులు చేర్పులు చేసుకోవాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఫారం-6 చేర్పులను నామినేషన్ వేసే 15 రోజుల ముందు వరకు చేసుకోవచ్చు అన్నారు. వచ్చే నెల 4, 5వ తేదీల్లో ఓటర్ల కోసం ప్రత్యేక ప్రచారం చేసి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటర్లుగా నమోదు అయిన వారు ఉంటే వారికి వారు కోరుకున్నచోట మాత్రమే ఓటర్లుగా నమోదు చేసి మిగిలిన చోట్ల తొలగించాలన్నారు. అనంతరం ఓటర్ల జాబితాను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ షఫి, తహసీల్దార్ గురప్ప తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని కలసికట్టుగా అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసికట్టుగా పనిచేసి అభివృద్ధి పథంలో నడిపిద్దామని సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవనంలో ఎంపీడీవో శ్రీధర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అందవలసిన సంక్షేమ పథకాలు అన్ని అందుతున్నాయన్నారు. అందని పక్షంలో అధికారులు వాటిపై దృష్టి సారించాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉపమండల అధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలో చుక్కల భూములు, అసైన్డ్ కమిటీలోని భూములు పట్టాలు అవుతున్నప్పటికీ చింతకొమ్మదిన్నె మండలంలో ఎందుకు అవటంలేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. రైతులను ఇబ్బందికి గురిచేయడం సరైన పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ అలాంటిది ఏమైనా ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకువస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కళాయాదవ్, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, సర్పంచులు సురేంద్రరెడ్డి, నాగముని, సుభద్ర, మహేశ్వరి, సుబ్బరాయుడు, ఎంపీటీసీలు నాగరాజు, వెంకటరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు



జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : జగనన్న ప్రభుత్వంలోనే ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం స్థానిక చిన్నకొండప్పకాలనీ సచివాలయ పరిధిలోని బైపాస్ రోడ్డు, సాయిబాబా గుడి, మారుతి హాల్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కొండలరావు ఆధ్వర్యంలో వైఎస్ మనోహర్‌రెడ్డి వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి గడపకు వెళ్తూ ప్రతి ఒక్క కుటుంబానికి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని ఆయన వివరించారు. ముందుగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగల శైలజ వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకుంటూ అధికారుల ద్వారా వాటిని పరిష్కరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మందికి వైద్యం అందించే మంచి కార్యక్రమమని, ఇది ఒక వరంలాంటిదని వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. నగరిగుట్ట, భాకరాపురం అర్బన్ హెల్త్ సెంటర్లలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో భాకరాపురం 288, నగరిగుట్ట 352 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను అందజేశారు. వివిధ రకాల జబ్బులకు సంబంధించిన వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లా, కమిషనర్ నరసింహారెడ్డి, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి, పార్నపల్లి కిశోర్, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, కౌన్సిలర్లు డేనియల్‌బాబు, ఖాదర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, కృష్ణమూర్తి, సంపత్, పద్మనాభరెడ్డి, మస్తాన్‌వలి, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

వాల్మీకి రామాయణం రచించిన ఆయన ప్రజల మదిలో నిలిచిపోయిన గొప్ప మహానుభావుడని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న వాల్మీకి సంఘం కార్యాలయంలో వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తాలూకా అధ్యక్షుడు అంబకపల్లె బాలుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు వాల్మీకి గొప్పతనం గురించి మాట్లాడారు. అనంతరం వారిని సత్కరించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, వాల్మీకి సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.40 వేలు పలికిన చీనీ ధర



మార్కెట్‌లో చీనీకాయల వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్ : పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో చీనీకాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో మార్కెట్‌కు చీనీ కాయలు తరలించే రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మార్కెట్‌లో వేలంపాటను నిర్వహించగా రూ.40వేలు పలికింది. దీంతో చీనీ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దీంతో పులివెందుల ప్రాంతంలో పండించిన చీనీకాయలను రైతులు మార్కెట్‌కు తరలించి విక్రయాలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డిలు చీనీమార్కెట్‌లో నిర్వహించిన వేలంపాటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పులివెందుల్లో చీనీకాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను అందజేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

జమ్మలమడుగు రూరల్ : మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అన్నారు. శనివారం పాతబస్టాండ్‌లో ఉన్న మున్సిపాలిటీ మస్టర్ పాయింట్ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సొంత నిధులతో పారిశుద్ధ్య కార్మికులకు చైర్ పర్సన్ చేతుల మీదుగా దుస్తులను అందజేశారు. అక్షయ ధార్మిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్మికులకు చలికోట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ కార్మికులు కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించారన్నారు. అటువంటి వారికి ఎంత చేసినా తక్కువే అని ఆమె కొనియాడారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ తాను ఎక్కడ విధులు నిర్వహించినా ఏడాది ఒక సారి పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శింగరయ్య, అక్షయ ధార్మికఫౌండేషన్ అధ్యక్షుడు సి.జయతిమ్మారెడ్డి, సి.రమేష్‌రెడ్డి, మునుస్వామి, రవికుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం 19, 20 వార్డ్ ప్రజలకు స్థానిక సరస్వతి విద్యా మందిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ఏర్పాటు చేశారు. పేద ప్రజల కోసం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. దీర్ఘ కాలంగా ఉన్న రోగాలను సైతం ప్రజలు చూపించుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం రోగులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శివప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ షామీర్ బాషా, సచివాలయ కన్వీనర్ మహబుబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

పెండ్లిమర్రి : పేదప్రజల ఆరోగ్యం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ తెలిపారు. మండలంలోని నంది మండలం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మారు మూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదని, అందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చూట్టారన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్, మాధవిలత, వైద్యులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి

పులివెందుల రూరల్ : స్థానిక ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ లక్ష్యమని ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన డిపో ఉద్యోగులను ఉద్దేశించి గేట్ మీటింగ్ నిర్వహించి మట్లాడారు. రవాణా రంగంలో కూడా ప్రయాణికులకు, రైతులకు, ఉద్యోగులకు, వ్యాపారస్తులకు డోర్ డెలివరీ సదుపాయం గురించి తెలియజేయాలన్నారు. ప్రయాణికులే దేవుళ్లని, ప్రయాణికులు కోరిన చోట బస్సు ఆపడం, ఎక్కించుకోవడం చేయాలన్నారు. ప్రయాణ కూడళ్ల వద్ద రెండు నిమిషాలు బస్సులు ఆపి ఊరి పేర్లు చెప్పి ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలన్నారు. ముఖ్యంగా ప్రమాదాలు నివారించే విధంగా కండక్టర్లు ఫుట్‌బోర్డు మీద నిలబడిన ప్రయాణికులను గమనిస్తూ ఉండాలన్నారు. డోర్ డెలివరీ పక్షోత్సవాలను విజయవంతం చేసేవిధంగా ఆర్టీసీ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కుల్లాయప్ప, ఆర్ఎం.రెడ్డి, ఆచారి, డ్రైవర్, కండక్టర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

31న జాబ్‌మేళా

వైవీయూ / కడప సిటీ: కడప నగరంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో ఈనెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ కె. రత్నరాజు తెలిపారు. కడపకు చెందిన గోల్డ్‌ఫీల్డ్స్ జేసీబీ, సాయివేణి కమ్యూనికేషన్స్ అండ్ అసోసియేట్స్, లక్ష్మిమేఘన ఎంటర్‌ప్రైజెస్ తదితర కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికయ్యే అభ్యర్థులకు రూ. 10 వేల నుంచి రూ.16 వేల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలు, మార్కులిస్టులు, 2 ఫొటోలు, ఆధార్‌కార్డు, బయోడేటాలతో హాజరుకావాలని సూచించారు.

17వ విడత సామాజిక తనిఖీకి ఓపెన్ ఫోరం



మాట్లాడుతున్న డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ

వేంపల్లె : ఉపాధిహామీ పథకానికి సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీకి ఓపెన్ ఫోరం నిర్వహించినట్లు డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఓపెన్ ఫోరం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు రూ.11.50 కోట్లు ఉపాధి హామీ పథకానికి సంబంధించి 1725 పనులు చేపట్టామన్నారు. అందులో సామాజిక తనిఖీ విభాగం పరిశీలించి, రిపోర్ట్ సమర్పించారు. కొన్ని పనులకు సంబంధించి ఉపాధి కూలీల నుంచి రూ.14229 నగదును రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, క్లస్టర్ ఏపీడీ సుబ్బారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్రమరెడ్డి, రైతులు, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

బస్సు జాతా విజయవంతం చేయండి

వైవీయూ : కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం నిర్వహించే బస్సుజాతాను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి. శివకుమార్, నగర కార్యదర్శి డీఎం ఓబులేసు కోరారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో బస్సు జాతాకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు.

ఈక్రాప్ నమోదుపై సోషల్ ఆడిట్



లింగాలలో ఈక్రాప్ నమోదు జాబితాను ప్రదర్శిస్తున్న ఏఓ, ఆర్బీకే సిబ్బంది

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల్లో 2023 ఖరీఫ్‌కు సంబంధించి వ్యవసాయ, రెవెన్యూశాఖ సమన్వయంతో ఈ క్రాప్ నమోదు చేయడం జరిగింది. ఆ విధంగా నమోదు చేయబడిన జాబితాను ఇప్పట్ల, దొండ్లవాగు, లింగాల రైతు భరోసా కేంద్రాలలో ఏఓ రమేష్ ఆధ్వర్యంలో జాబితాను ప్రదర్శించారు. ఈ క్రాప్ నమోదులో లోటుపాట్లు ఉంటే సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. ఏవైనా పొరపాట్లు జరిగిఉంటే రైతుల ఫిర్యాదు మేరకు వాటిని సవరిస్తామన్నారు. నవంబర్ 1వ తేదీన తుది జాబితాను రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించి గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. అభ్యంతరాలు ఏవైనా ఉంటే వ్రాతపూర్వకంగా తెలియపరచి ఆర్బీకే సిబ్బందికి తెలపాలని ఆయన సూచించారు. ఆయా గ్రామాల సర్పంచులు, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వేముల : మండలంలోని వి.కొత్తపల్లె రైతు భరోసా కేంద్రంలో శనివారం పంట నమోదుపై వీఏఏ లక్ష్మీదేవి సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌కు సంబంధించి ఈక్రాప్ నమోదు చేసిన రైతుల వివరాలతో జాబితాను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించామన్నారు. ఈ జాబితాలో తప్పులు ఉన్నట్లైతే ఈనెల 30వ తేదీలోపు రైతు భరోసా కేంద్రంలో రైతులు తెలిపితే సరిదిద్దే అవకాశం ఉందన్నారు. జాబితా చదివిన రైతులందరు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని, తరువాత ఏదైనా ఇన్సూరెన్స్ వర్తించని సందర్భంలో ఏమీ చేయలేమని, రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెద్దముడియం : రైతు భరోసా కేంద్రాలలో ఖరీఫ్-2023 పంట వివరాలను సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శించారని వివరాలు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అరుణ సూచించారు. శనివారం ఆమె మండలంలోని కొండసుంకేసుల రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న సామాజిక తనిఖీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు ఎంత విస్తీర్ణంలో ఏ పంటలు నమోదు చేశారు అనే అంశాలను జాబితాలో పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 29వ తేదీ లోపు వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. రైతుల నుంచి అందిన అభ్యంతరాలను పరిష్కరించి నవంబర్ 1వ తేదీన తుది జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామన్నారు. అనంతరం గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.

పంట నమోదుపై గ్రామసభ

ముద్దనూరు : ఖరీఫ్ సీజన్‌లో చేపట్టిన పంట నమోదుపై కొత్తపల్లె, నల్లబల్లె గ్రామాల్లో అధికారులు శనివారం గ్రామసభ నిర్వహించారు. పంట నమోదుకు సంబంధించిన జాబితాను కొత్తపల్లె సర్పంచ్ అరుణమ్మ, మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డిలు విడుదల చేశారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు జాబితా ప్రదర్శించనున్నట్లు, రైతులు ఈ జాబితాను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు వుంటే తెలపాలని ఆయన కోరారు.

భక్తి శ్రద్ధలతో పుష్పగిరి గిరి ప్రదక్షిణ



శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి



గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు అన్నదానం

వల్లూరు : పుష్పగిరి పుణ్య క్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలివచ్చిన భక్తులు పుష్పగిరి కొండకు కొబ్బరి కాయలు కొట్టి భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ, శ్రీ సంతాన మల్లేశ్వరస్వాములను దర్శించుకుని పూజలు చేశారు. పెన్నానదిలో స్నానాలు ఆచరించారు. పుష్పగిరి క్షేత్ర ధర్మ నిర్ణయ మండలి అధ్యక్షుడు దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు తాగు నీటి సౌకర్యాలను కల్పించారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

వేంపల్లె : ఈనెల 31, ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా పిలుపునిచ్చారు. శనివారం వేంపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐటీయూసీ కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ సమావేశంలో భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, వర్కింగ్ ప్రసిడెంట్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.